క్లుప్తంగా

నేడు గజ్వేల్‌కు కిషన్‌రెడ్డి రాక

గజ్వేల్: గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నామినేషన్ కార్యక్రమానికి మంగళవారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు గజ్వేల్‌లో నిర్వహించనున్న ర్యాలీలో పాల్గొంటారని ఆపార్టీ వర్గాలు తెలిపాయి.

'ఆ పార్టీలకు గుణపాఠం తప్పదు'

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే రాజకీయ పార్టీలకు గుణపాఠం తప్పదని మాల మహానాడు రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్, టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన మాదిగల యుద్ధభేరి సభలో మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఎస్సీ వర్గీకరణ చేపడుతామంటూ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీయే లక్ష్యం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నుంచి మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రజాప్రతినిధులు వెంకటేష్, గొడుగు స్వామి, హరిబాబు, ఆంజనేయులు, మల్లేశం, సత్యం, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో హింసకు తావు లేదు

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణలో హింసా రాజకీయాలకు తావులేదని సీఎం కేసీఆర్ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి అమీర్ అన్నారు. మిరుదొడ్డిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ గడ్డపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, ఎంపీటీసీలు లక్ష్మి, నర్సింహులు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సూకూరి లింగం, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, నాయకులు రాధాకృష్ణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో దోపిడీ

చిన్నకోడూరు(సిద్దిపేట): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పేరుతో వేల కోట్లు దోచుకున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. సోమవారం చిన్నకోడూరులో కాంగ్రెస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబద్దాలతో ప్రజలను మభ్యపెడుతున్న మంత్రి హరీశ్‌రావుకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, అజ్జు, శ్రీనివాస్, జయంత్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

ములుగు(గజ్వేల్): సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి అన్నారు. మండలంలోని బస్వాపూర్‌లో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సంక్షేమ దిశగా నడిపిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ వైస్ చైర్మన్లు నరేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గణేష్‌గుప్త, లింగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాష, మండల ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్, నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, అయిలేష్‌యాదవ్, నర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్ర ప్రగతి



ములుగు(గజ్వేల్): బీజేపీతోనే గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని వంటిమామిడిలో సోమవారం ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖా యమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. నేటి ఈటల రాజేందర్ నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సత్యం, దత్తుగౌడ్, యాదగిరి, అచ్యుత్‌రావు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటాలి

- డీవైఎస్‌ఓ నాగేందర్



ఫుట్‌బాల్ శిక్షణలో పాల్గొంటున్న క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: క్రీడాకారులు శిక్షణను సద్వినియోగం చేసుకొని తమలోని ప్రతిభను చాటాలని డీవైఎస్‌ఓ నాగేందర్ సూచించారు. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ స్టేడియంలో కొన్ని రోజులుగా జరుగుతున్న నేషనల్ సీనియర్ మహిళల ఫుట్‌బాల్ క్యాంపును సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటతీరును మెరుగు పర్చుకునేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. 14 రోజుల పాటు జరుగుతున్న క్యాంపులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. వీరిలో 22 మంది బాలికలు ఈనెల 15 నుంచి పశ్చిమబెంగాల్‌లోని కలకత్తాలో జరిగే నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేష్, జనరల్ సెక్రటరీ గణేష్, ట్రెజరర్ నరేష్, నర్సింలు, క్లబ్ సభ్యులు శేఖర్, నర్సింలు, శ్రీధర్, కృష్ణమూర్తి, చక్రపాణి, సుగుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధికి కృషి



జనగామ: మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బచ్చన్నపేట: మాట్లాడుతున్న రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ రమణారెడ్డి

- ఆశీర్వదించి గెలిపించండి
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: జనగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో సోమవారం 3, 4, 5 వార్డుల కాలనీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ తనను ఇక్కడకు స్వయంగా పంపించారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో జనగామ ప్రాంతం ముందుండి పోరాటం చేసిందని చెప్పారు. జిల్లాలో ఒక్కో ఊరికి ఒక్కో చరిత్ర ఉందని, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య లాంటి యోధులు జన్మించి పుణ్యభూమి పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, నక్సలైట్ ఉద్యమం, స్వరాష్ట్రం కోసం తొలి, మలి దశ పోరాటంలో జనగామ ప్రాంతం ముఖ్యభూమిక పోషించిందని తెలిపారు. ఈ ప్రాంత పేద ప్రజల జీవన విధానం మార్చడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో రూ.కోటి నిధులతో సీసీ రోడ్లు వేయిస్తామని చెప్పారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే, వచ్చే ఐదేళ్లలో జనగామను గజ్వేల్, సిద్దిపేటకు దీటుగా తీర్చి దిద్దుతామని వివరించారు. అభివృద్ధి ఎలా చేయాలనే దానిపై తనకు ఆలోచన ఉందని వివరిచారు.



మద్దూరు: గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న పల్లా



జనగామ:పెంబర్తిలో ప్రచారం చేస్తున్న రేఖ

ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గంలోని గ్రామాలను ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండా, కూటిగల్, హనుమ తండా, కొండాపూర్, దుబ్బాతండా, బెక్కల్, బైరాన్‌పల్లి గ్రామాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాతే గ్రామాలు, తండాల అభివృద్ధికి పుష్కలంగా నిధులు వస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించగానే మెదటగా రూ. 60 కోట్లతో రెడ్యానాయక్ తండాను.. కూటిగల్ బురుజు, చెరువును అభివృద్ధి చేస్తానన్నారు. పూటకో పార్టీ మారే కొమ్మూరికి నన్ను విమర్శించే స్థాయి లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే పాల, విత్తనశుద్ధి కర్మాగారాలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలత మల్లేశం, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు యాదగిరి, మేక సంతోష్‌కుమార్, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశ, రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఆరీఫ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



మిరుదొడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం కృష్ణారెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం కృష్ణారెడ్డి కోరారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని లక్ష్మీనగర్, కొండాపూర్, లింగుపల్లి, అల్వాలతో పాటు అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్, అల్మాజీపూర్, అక్బర్‌పేట, కూడవెల్లి గ్రామాల్లో సోమవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీసీలు వైకుంఠం, అక్బర్, భాస్కర్, బాల్‌రాజు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ అర్జున్‌రావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తొగుట(దుబ్బాక)/దౌల్తాబాద్: మండలంలోని రాంపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈఓ గంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేష్, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి స్వామి, రైతులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి, దొమ్మాటలో కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ కార్యదర్శి మల్లేశం ప్రారంభించారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపెల్లిలో సోమవారం ఏపీఎం నర్సయ్య ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ పద్మ, ఏఈఓ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



అనాజీపూర్‌లో పోలీసుల కవాతు

రాయపోలు(దుబ్బాక): అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషిచేస్తున్నట్లు గజ్వేల్ ఏసీపీ రమేష్ అన్నారు. మండలంలోని అనాజీపూర్, రాయపోలులో సోమవారం సాయంత్రం పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లోని వీధుల్లో తొగుట సీఐ కమలాకర్, రాయపోలు ఎస్సై రఘుపతితో పాటు పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి కవాతు చేశారు.

తొగుట(దుబ్బాక): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తొగుట సీఐ కమలాకర్ సూచించారు. మండలకేంద్రంతో పాటు పెద్ద మాసాన్‌పల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లో సోమవారం కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో తొగుట, బేగంపేట ఎస్‌ఐలు లింగం, అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన తూప్రాన్ - నర్సాపూర్ హైవే శివ్వంపేట వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొంతి గ్రామానికి చెందిన పంపరి స్వామి(28) టెంట్‌హౌజ్‌లో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి శివ్వంపేటకు వచ్చి సోమవారం తెల్లవారుజామున బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా శివారులో గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో స్వామికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

రామాయంపేట(మెదక్): సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఆదివారం రామాయంపేటకు చెందిన బల్ల ప్రత్యూష్(24) బైక్‌పై హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళుతుండగా అదుపుతప్పి ఎగిరి పక్క రోడ్డులో పడ్డాడు. అదే సమయంలో ఆ రోడ్డులో వస్తున్న లారీ తనపై నుంచి వెళ్లింది. దీంతో ప్రత్యూష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

దౌల్తాబాద్(దుబ్బాక)/తొగుట: బీఆర్ఎస్ నాయకుల ప్రచారం జోరుగా సాగుతోంది. దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు, ప్రజాప్రతినిధులు ఇందూప్రియాల్, చెట్ల నర్సంపల్లి, మాచిన్‌పల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరి సంధ్య, జెడ్పీటీసీ రణం జ్యోతి పాల్గొన్నారు. తొగుట మండలంలోని లింగంపేట, ఎల్లారెడ్డిపేటలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు రేణుక నర్సింలు, గోవర్ధన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

సతీష్‌కుమార్ గెలుపు కోసం పూజలు

హుస్నాబాద్‌రూరల్: ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఎంపీపీ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజిని సోమవారం స్వయంభుడి సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం పొట్లపల్లి, మీర్జాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పల్లా'ను అధిక మెజార్టీతో గెలిపించాలి

మద్దూరు(హుస్నాబాద్): పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంతోష్‌కుమార్ అన్నారు. వల్లంపట్లలో ఎన్నికల ప్రచార కమిటీని నియమించారు.

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కోరుతూ వర్గల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు తదితర నాయకులు సీతారాంపల్లి, శాకారంలో ప్రచారం చేశారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలో కౌన్సిలర్లు గుండా రాజ్యం చేస్తున్నారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడడం సిగ్గుచేటని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. సోమ వారం ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద కౌన్సిలర్లతో కలిసి మాట్లాడారు. మహిళ కౌన్సిలర్లకు రఘునందన్‌రావు బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేకుంటే వార్డుల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే అంధకారమే

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్‌ను నమ్మితే విద్యుత్ కోతలతో అంధకారమవుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని దేవక్కపల్లె, తోటపల్లి, వీరాపూర్, లక్ష్మీపూర్, గూడెం, బేగంపేట గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, గడ్డం నాగరాజు, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం



బచ్చన్నపేట: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన కొన్నె నాయకులు



కొమురవెల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రతాప్‌రెడ్డి

- అవినీతి రహిత పాలన అందిస్తా..
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ పాలన రావాలని ఆ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చుంచనకోట, వీరన్నపేట, ముస్త్యాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ ప్రాంత బిడ్డగా ఆదరించి గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అవినీతి రహిత పాలన అందిస్తానని పేర్కొన్నారు. ఎందరో ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బందీ అయిందన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను ప్రజలకు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ వరలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, నాయకులు నర్సింగరావు, పరమేశ్వర్, భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, యాదగిరి, మల్లేశం, స్వామి, రాకేశ్‌కృష్ణ, జయ, శ్రీకాంత్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

'పల్లా' అవినీతిపరుడు

కొమురవెల్లి: ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని మించిన అవినీతిపరుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అని కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మండల కేంద్రంతో పాటు రసులాబాద్, రాంసాగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం వివిధ పార్టీల నుంచి 400 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



చుంచనకోటలో మాట్లాడుతున్న కొమ్మూరి

హామీలను విస్మరించారు..

బచ్చన్నపేట: బీఆర్ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించిందని, అలాంటి పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల పరిధి పడమటికేశ్వాపూర్, కొన్నె, గోపాల్‌నగర్ గ్రామాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 200 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సర్పంచ్ గిద్దెల రమేష్, నాయకులు నల్లగోని బాలకిషన్‌గౌడ్, కోడూరి మహాత్మాచారి, జంగిడి విద్యానాథ్, పిట్టల ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ప్రచారం..

జనగామ: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపునకు మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. భువనగిరి మహిళా కాంగ్రెస్ అబ్జర్వర్ శాంతా, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోడలు కొమ్మూరి దివ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, మున్సిపల్ కౌన్సిలర్ వంగాల కల్యాణి ఆధ్వర్యంలో కురుమవాడ, వీవర్స్ కాలనీలో ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఆరు గ్యారంటీ స్కీంలను వివరించారు. ప్రజా సంక్షేమ పాలన రావాలంటే కాంగ్రెస్ చేయి గుర్తుకు ఓటు వేసి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు. ఆలేటి లక్ష్మి, సుంకరి నిర్మల, కామని జయ, విజయ లక్ష్మి, బిర్రు చందన, బిర్రు శ్రీలత, మునిబేగం, కుకట్ల సుజాత, బీమానాథం చందన ఎనగందుల లావణ్య, వంగాల మల్లారెడ్డి, ఆలేటి సిద్దిరాములు, జాయ మల్లేష్, బోరెల్లి సిద్దులు, బిర్రు సత్యనారాయణ, ఎనగందుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ: ఇంటింటా ప్రచారం చేస్తున్న కొమ్మూరి కోడలు దివ్య

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా స్వామి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు గ్రామానికి చెందిన గాదం స్వామిని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆపార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు బెజ్జంకిలో సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు.

◆ బీజేపీలో చేరికలు

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి పంచాయతీ వార్డు సభ్యులు కిష్టాగౌడ్, భిక్షపతి సోమవారం బీజేపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే రఘునందన్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ఉపఎన్నికలో గెలిచాకే దుబ్బాకలో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్రావుపేట ఎంపీటీసీ నర్సింలు, నాయకులు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు బహుమతులు

హుస్నాబాద్‌రూరల్: టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ వారు సోమవారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఎస్సీ గురుకుల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు కిరణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బహుమతులు అందించారు.

◆ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లిలో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల విజేతలకు క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బహుమతులను అందజేశారు.

◆ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 3, 4 ఆధ్వర్యంలో వలంటీర్లకు తొలిమెట్టు తదితర అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విజయభాస్కర్‌రెడ్డి, రాంచంద్రం పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

కొండపాక(గజ్వేల్)/దుబ్బాకరూరల్/దౌల్తాబాద్: మండలంలోని బందారంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ వాసరి లింగారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్‌పూర్‌లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

◆ నిరసన

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల పర్యటనలో భాగంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డికి నిరసన సెగ తగిలింది. సమస్యలపై పలువురు ప్రశ్నించారు. హన్మతండా సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే రూ.15 లక్షలు, ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి రూ.10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారని నేటికీ రూపాయి రాలేదని పలువురు యువకులు మండిపడ్డారు. రుణమాఫీ 30 శాతం మాత్రమే అయిందని, మిగతాది ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నిస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. నిరుద్యోగ భృతి, దళితబంధు అర్హులందరికీ అందించాలన్నారు. సర్పంచ్ తన ఇంటి ఎదుట సీసీ రోడ్డు వేయ లేదని గ్రామస్తుడు కిషన్‌నాయక్ పెట్రోల్ సీసాతో హంగామా సృష్టించాడు.

◆ ఓటు వేసేందుకు అంగీకారం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కపూర్ నాయక్‌తండా గ్రామస్తులు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు బహిష్కరిస్తామని ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం తహసీల్దార్ ఇంజమూరి సంజీవ్‌కుమార్ గ్రామానికి వెళ్లి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. దీంతో ఓటు వేస్తామని గ్రామస్తులు అంగీకరించారు.

◆ పీవైఎల్ నుంచి బహిష్కరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జాతీయ కన్వీనర్‌గా కొనసాగుతున్న మన్నె ప్రకాష్‌ను బహిష్కరిస్తున్నట్లు సోమవారం ఆసంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బానోతు సంతోష్‌నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో సోమవారం కుక్కలు స్వైర విహారం చేశాయి. ఒకే రోజు గంట సమయంలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు చిన్నారులను గాయపరిచాయి. హనుమాన్‌నగర్‌లో ఇద్దరు చిన్నారులపై.. పక్కనే ఉన్న శంకర్‌నగర్‌లో ఆరుబయట ఆడుకుంటున్న మరో చిన్నారిని గాయపరిచాయి. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఒక చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990